క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ప్రజయ్‌నివాస్ ఫీడర్ కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు. 11కేవీ మారుతీనగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు సరఫరా ఉండదని తెలిపారు.

కాలనీల్లో సౌకర్యాల కల్పనకు కృషి

యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి



26వ డివిజన్‌లోని తిరుమలనగర్‌లో వేసిన బీటీరోడ్డు

బడంగ్‌పేట్: అన్ని కాలనీల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్ తిరుమలనగర్ కాలనీలో పూర్తయిన బీటీరోడ్డు పనులను రాఘవేందర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడంగ్‌పేట కార్పొరేషన్ మాజీ మేయర్ చిగురింత పారిజాతానర్సింహారెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అన్ని కాలనీల్లో ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని వెల్లడించారు. బీటీరోడ్డు నిర్మాణానికి సహకరించిన మాజీ మేయర్ పారిజాతకు ధన్యవాదాలు తెలిపారు.

బైబిల్ సేవల్లో బాలాసింగ్‌కు డాక్టరేట్



బాలాసింగ్ దంపతులను సన్మానిస్తున్న పాస్టర్లు

బడంగ్‌పేట్: అమెరికన్ బాప్టిస్ట్ ఫారిన్ మిషన్ సొసైటీ బైబిల్ సేవలకు గానూ డాక్టరేట్ అవార్డు అందుకున్న రెవరెండం జర్పుల బాలాసింగ్ దంపతులను బడంగ్‌పేట్ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. అల్మాస్‌గూడ, వినాయకహిల్స్- 2లో ఉన్న బైబిల్ చర్చి పాస్టర్లు బాలాసింగ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు డానియల్‌రాజ్, సామియేలు, సోమేశ్వరరావు, అరుణజ్యోతి, లాజర్‌నాయక్, బాబురావు, ఒనేసిఫోర్, రాయ్‌కురియన్ తదితరులు ఉన్నారు.

అవగాహనతో కుష్టు నిర్మూలన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

హుడాకాంప్లెక్స్: సరైన అవగాహన ద్వారా కుష్టు వ్యాధిని నిర్మూలించవచ్చని పారామెడికల్ రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పురుషోత్తంరావు అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల సందర్భంగా బుధవారం లయోల పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సరూర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పురుషోత్తంరావు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు పక్షోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థులకు, మహిళా మండలి, యువజన సంఘాల వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సద్గుణాచారి, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ చంద్రయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

కందుకూరు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సరిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్లపై ఏవైనా అభ్యంతరాలు, సలహాలు, సూచనల కోసం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు.

గూడు దక్కింది.. గోడు మిగిలింది

పేదల గూడు జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎంలో సమస్యలు తిష్టవేశాయి. సౌకర్యాల లేమితో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. కనీస నీటి సౌకర్యం సరిగా లేక అవస్థలు పడుతున్నారు. బోరు బావులు ఉన్నప్పటికీ.. తగిన ఏర్పాట్లు చేయడంలో కార్పొరేషన్ అధికారులు విఫలమయ్యారు.

జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎంలో సమస్యల తిష్ట

- సౌకర్యాల లేమితో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటులో జాప్యం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్ల సముదాయం

బడంగ్‌పేట్: దివంగత నేత, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మానసపుత్రిక జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం నివాసగృహాలు. నాడు కాంగ్రెస్ పార్టీ పేదల కోసం వీటిని నిర్మించింది. అర్హులకు కేటాయించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. అక్కడ సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గూడు అయితే ఇచ్చారు కానీ.. వసతులు లేక కొట్టుమిట్టాడుతున్నామని, మా గోడు వినేవారు లేరని లబ్ధిదారులు వాపోతున్నారు.

225 బ్లాకులు.. 16 పోర్షన్లు

బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి కుర్మల్‌గూడలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పేరుతో పేదల కోసం ఇళ్లను నిర్మించారు. ప్రస్తుతం జీ+త్రీలో నాలుగు ఫేస్‌లుగా విభజించారు. 225 బ్లాకులతో 16 పోర్షన్లుగా ఒక్కో పోర్షన్‌కు 224 డబుల్ బెడ్రూం ఇళ్లను, మొత్తంగా 16 వందల డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించారు. నిరుపేదలకు కేటాయించారు. 40 గజాల్లో రెండు బెడ్రూంలు, రెండు కిచెన్‌లు రెండు బాత్రూంలు నిర్మించారు. గృహసముదాయానికి అయిన సామగ్రి ఖర్చును మాత్రమే లబ్ధిదారుని వద్ద తీసుకుని, రెండు పడక గదులను కేటాయించారు.

కేటాయింపులు సరే.. వసతులేవి?

నాటి ప్రభుత్వాలు నిరుపేదలకు ఇళ్లు కేటాయించి చేతులు దులుపుకొన్నాయి. వసతుల గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. నాలుగు అంతస్తులు నిర్మించినప్పటికీ.. ఆ పైకి నీటి సరఫరాను మరిచారు. దీంతో చేసేది లేక లబ్ధిదారులు కింద నుంచి నాలుగో అంతస్తుకు నిత్యం బిందెలతో నీరు మోస్తున్నారు. ఒక్క పై అంతస్తుల్లోనే కాదు.. కింద వారికి ఇవే సమస్యలు. అదే ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో పార్కుల అభివృద్ధి జరగలేదు. అంగన్ వాడీ కేంద్రం మంజూరు చేయలేదు. ఇక్కడ జనాభా పెరుగుతున్నప్పటికీ.. పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. ఏడాది క్రితం ప్రాథమిక పాఠశాలను నిర్మించారు. అందుకు అవసరమైన వసతులు మరిచారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, భవన సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బోర్లు ఉన్నాయి..



జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎంలో నివాసం ఉంటున్న పేదలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇళ్లు ఇచ్చి చేతులు దులుపుకొన్నాయి. సౌకర్యాలు మరిచింది. తొలుత కావలసిన మౌలిక వసతులు కల్పించాలి. బోర్లు ఉన్నాయి. వాటి ద్వారా నాలుగు అంతస్తుల పైకి నీరు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలి.

– పురుషోత్తం, ఎంసీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు

సమస్యలు పరిష్కరిస్తాం



కుర్మల్‌గూడ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మా దృష్టికి వచ్చాయి. త్వరలో పరిష్కరిస్తాం. అక్కడ 20కి పైగా బోర్లు ఉన్నాయి. నాలుగు అంతస్తుల పైకి నీరు చేరడం లేదని ప్రజలు విన్నవించారు. పరిశీలించి పరిష్కార మార్గం చూపుతాం.

– సరస్వతి, కమిషనర్

విద్యార్థులకు అభినందన



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్

మహేశ్వరం: ఉస్మానియా యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ ల్యాంగ్వేజ్(సెల్ట్) ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నిర్వహించిన ఆంగ్ల భాష శిక్షణలో ప్రతిభ కనబర్చిన మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులను ప్రిన్సిపాల్ డా.రమేశ్ అభినందించారు. రాష్ట్రస్థాయి ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థుల కోసం ఉస్మానియా యూనివర్సిటీలో సెంటర్ ఫర్ ఇంగ్లిష్ ల్యాంగ్వేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణకు కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు బీఏ సెకండియర్ నుంచి ఎస్.కళ్యాణ్, ఎం.శైలజ, బీకాం ఫస్టియర్ నుంచి స్వాతి ఎంపికయ్యారు. విద్యార్థులు నెలరోజుల పాటు శిక్షణ తీసుకున్నారు. విద్యార్థులు ఇంగ్లిష్ భాషా కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ మెరుగుపరుచుకున్నారని ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. తమ కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థులు శిక్షణ తీసుకోవడం, వారికి సర్టిఫికెట్లు రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఇంతియాజుద్దీన్ ఫారోఖీ, పర్హాత్ నాజ్నీన్ పలువురు పాల్గొన్నారు.

పరిహారం అందించేవరకు పోరాటం

ఆ సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు



ధర్నా చౌక్ వద్ద రైతులతో కలిసి ధర్నా చేస్తున్న ఆంజనేయులు

షాబాద్: చందనవెళ్లి భూనిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించకుంటే అసెంబ్లీ ముట్టడిస్తామని భూ నిర్వాసితుల సంఘం మండల అధ్యక్షుడు నీరటి ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద మండల పరిధిలోని చందనవెళ్లి, మాచన్‌పల్లి, హైతాబాద్, సీతారాంపూర్‌తో పాటు తెలంగాణలోని వివిధ గ్రామాల నుంచి నష్టపోయిన రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కొని, అసలైన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెంటనే భూ నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి, 14 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు న్యాయం జరగలేదని వాపోయారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూనిర్వాసితులందరం కలిసి అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు సుభద్రరెడ్డి, సంఘం ఉపాధ్యక్షులు రెడ్డయ్య, నర్సింహులు, రైతులు తదితరులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని చీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ నిర్వాహకులు మొకరాల రాజశేఖర్‌శర్మ, భాస్కర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఎమ్మెల్సీ సురభీవాణీదేవి, ఎంపీడీఓ సరిత తదితరులు పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్, నాయకులు పాండురంగారెడ్డి, దామోదర్‌గౌడ్, రవీందర్, వెంకటేశ్, మహేందర్‌రెడ్డి, మహేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న స్నేహితురాలికి ఆర్థికసాయం



రాధికకు నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కందుకూరు: చిన్నతనంలో తమతో పాటు చదువుకున్న మిత్రురాలు ప్రమాదంలో గాయపడగా ఆమెకు ఆర్థికసాయం చేసి తాము ఉన్నామని ధైర్యం ఇచ్చారు పూర్వ విద్యార్థులు. మండల పరిధిలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాల 2009–10 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి రాధిక ప్రమాదంలో కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొంది, ప్రస్తుతం ఇంట్లో ఉంటుంది. కాగా విషయం తెలుసుకున్న ఆమెతో చదువుకున్న నేదునూరు, మాన్యగూడ, బాచుపల్లి గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులందరూ కలిసి రూ.50వేల నగదు జమచేశారు. బుధవారం ఆమెను పరామర్శించి నగదు అందించి ధైర్యం ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్‌కు వేతనం అందజేత



వలంటీర్‌కు వేతనం అందిస్తున్న రాజేశ్‌పటేల్

కొందుర్గు: మండల కేంద్రంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో వలంటీర్‌గా పనిచేస్తున్న సోనికి మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ బుధవారం వేతనం అందజేశారు. నెలకు రూ.3వేల లెక్కన 9 నెలలకుగాను రూ.27వేల తన సొంత డబ్బులు ఆమెకు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి తన సొంత డబ్బులతో వలంటీర్‌ను నియమించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరమేశ్వరి, ప్రియరంజనీ, ప్రశాంతి, మౌనిక నాయకులు జగదీశ్వర్ గౌడ్, గోపాల్, రమేశ్, రాజుగౌడ్, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి



క్రీడాకారులతో మాట్లాడుతున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని షాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన తండ్రి దివంగత నేత పట్నం రాంజేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రతి ఏడాది జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది స్థానిక యువతకు క్రీడల్లో అవకాశం కల్పించేందుకుగాను చేవెళ్ల నియోజకవర్గ స్థాయి క్రికెట్, వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 24వ తేదీన క్రీడాపోటీలు ప్రారంభిస్తామని వెల్లడించారు. క్రికెట్‌లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.2లక్షలు, రెండో బహుమతి రూ.1లక్ష నగదుతో పాటు మొమెంటోలు అందిస్తామన్నారు. అదేవిధంగా వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.30వేలు, రెండో బహుమతి రూ.15వేలు అందిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఒక్కో మండలానికి నాలుగు టీమ్‌లను తీసుకోనున్నట్లు చెప్పారు. షాబాద్‌కు ఎక్కువ టీమ్‌లకు అవకాశం ఇస్తామని స్పష్టం చేశారు. క్రీడాకారులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు. ఏ మండలానికి సంబంధించిన క్రీడాకారుడు ఆ మండలంలోని టీమ్‌లో మాత్రమే ఆడేందుకు అవకాశం ఉంటుందన్నారు. తప్పనిసరిగా ఆధార్‌కార్డుతో పాటు డ్రెస్‌కోడ్ ఉండాలని సూచించారు. ఈ నెల 21వ తేదీలోపు టీమ్‌లు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని, ఉచిత భోజన సదుపాయం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకునేందుకు 9849711579, 9949086569 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

పుట్టి పెరిగిన ఊరిపై మమకారం

- గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు
- ఆదర్శంగా నిలుస్తున్న పెద్దమ్మ తండాకు చెందిన డాక్టర్ నితీశ్‌నాయక్



వలంటీర్‌గా రోగులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ నితీశ్‌నాయక్

మహేశ్వరం: కన్న ఊరితో పాటు చుట్టు పక్క గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించి ఆదర్శంగా నిలుస్తున్నాడు మండల పరిధిలోని పెద్దమ్మతండాకు చెందిన నేనావత్ నీలమ్మ–విఠల్ నాయక్‌ల కుమారుడు నేనావత్ నితీశ్‌నాయక్. కష్టపడి చదివి నీట్‌లో ర్యాంకు పొంది బెంగుళూర్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. ఎంబీబీఎస్ డాక్టర్ కోర్సు పూర్తి చేసిన తాను పుట్టి పెరిగిన మండలం, గ్రామంలో పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలని గత ఐదునెలల క్రితం మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో ఉన్న 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడిగా చేరి రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఆస్పత్రిలోనే కాకుండా తన సొంతూరు పెద్దమ్మతండాలో నివాసం వద్దకు ఆరోగ్య సమస్యలతో ఎవరైనా ప్రజలు వస్తే వారికి ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అమీర్ సిద్దీఖీ సహకారంతో ఆస్పత్రిలో విధులకు హాజరై రోగులకు సేవలు అందించారు. వలంటీర్ వైద్యుడిగా ఉచిత సేవలు అందిస్తూ పీజీ నీట్ పరీక్షలకు ప్రిపరేషన్ అయ్యాడు. ఇటీవల విడుదలైన పీజీ నీట్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి తమిళనాడు చెన్నైలో పీజీ ఆర్థోఫిట్ చదవడానికి వెళ్తున్నారు. పీజీ కోర్సు పూర్తయ్యాక తాను పుట్టి పెరిగిన తండా, మండలంలో పేదలకు ఉచిత సేవలు అందిస్తానని డాక్టర్ నితీశ్‌నాయక్ తెలిపారు. చిన్నప్పుడు మా తండా, మండలంలో వైద్య సేవలు అందక ఎంతో మంది పేదలు, కుటుంబ సభ్యులు ఇబ్బంది పడ్డారని, వాటిని చూసిన తనకు ఎలాగైనా కష్టపడి చదివి డాక్టర్‌గా పుట్టి పెరిగిన ప్రాంతాల్లో ఉచితంగా వైద్య సేవలు అందించాలని నిర్ణయించుకున్నాని తెలిపారు. భవిష్యత్‌లో పేదలకు, తాను పుట్టి పెరిగిన మహేశ్వరం మండల ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందిస్తానని నితీశ్ స్పష్టంచేశారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి



దాత రాఘవేందర్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మహేశ్వరం: గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ నాయకులు మర్యాద రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామంలో హనుమాన్ ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లుకు రూ.40వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం రాఘవేందర్‌రెడ్డిని ఘనంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మహేశ్వరం పోలీస్ స్టేషన్ సీసీ కెమెరాల ఇన్‌చార్జి ప్రవీణ్, గ్రామ పెద్దలు పబ్బ బాల్‌రాజ్‌గౌడ్, పబ్బ అంజనేయులుగౌడ్, రాజుయాదవ్, కుమార్ గౌడ్ పలువురు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దేవునిమామిడిపల్లి సంగిగుట్ట తపోవనంలో సీతారామ, ఆంజనేయస్వామివారి దేవాలయ 11వ వార్షికోత్సవాన్ని దయానంద గిరిస్వామి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు గ్రామస్తులు పెద్ద ఎత్తున హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, నర్సప్పగూడ మాజీ సర్పంచ్ గోవిందు అశోక్‌కుమార్, నిర్విక ల్పానందస్వామి, వాస శ్రీనివాసులు, వాస వినోద్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్చకులు అప్రమత్తంగా ఉండాలి

తుక్కుగూడ: రాష్ట్రంలో ఆయా ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులు అప్రమత్తంగా ఉండాలని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ అనువంశిక ధర్మకర్తలు, బ్రహ్మణ సంఘం నాయకులు శేషం జగన్నాథాచార్యులు సూచించారు. బుధవారం పుర పరధిలోని శ్రీనగర్ ఆలయంలో ఆయన మాట్లాడారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడి హేయమైన చర్య అన్నారు. ఇలాంటి దాడులు జరగకుండా హిందుత్వవాదులు, అర్చకులు ఐక్యంగా ఉండాలన్నారు. దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవం

కందుకూరు: విద్యుత్ శాఖ ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం డీఈఓ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు ఎస్.రమేశ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీను మాట్లాడుతూ.. సంఘం ఏర్పాటై 74 ఏళ్లు పూర్తయ్యాయన్నారు. ఆ సంఘం నాయకులు శ్రవణ్‌కుమార్, శ్రీకాంత్, వహీద్, వాత్రానాయక్, శ్రీను, ప్రభుదాస్, రాంనాథన్, చంద్రశేఖర్, శేఖర్‌చారి పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్లోర్‌మాట్స్ అందజేత

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని బీజేపీ యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం బుధవారం ఆయన ఫ్లోర్‌మాట్స్‌ను ఉపాధ్యాయులకు అందజేశారు.

రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి



మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎన్కెపల్లి గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడుతూ బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని బీఆర్‌ఎస్ మండల నూతన అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి సమీపంలో గల పావనీ రిసార్ట్స్‌లో ఎన్కెపల్లి గ్రామానికి చెందిన సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాము, గ్రామ అధ్యక్షుడు పెండ్యాల శ్రీనివాస్, నాయకులు సుభాష్, సత్యనారాయణ, గ్రామస్తులు కలిసి వెంకట్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. అందరం కలిసికట్టుగా గ్రామస్థాయి నుంచి బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దామన్నారు. గ్రామాల్లో ఇప్పటికే కాంగ్రెస్‌పై ప్రజలు విమర్శలు చేస్తున్నారని తెలియజేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమం నాయకులు తదితరులు పాల్గొన్నారు.